కథ

# ధ్వజరేఖ

- ఏ.కె.వి. రత్నమాల

"ఈ జాతకాలూ, సాముద్రికాలూ ఇవన్నీ మనుషులకి మనశ్శాంతి లేకుండా చెయ్యడానికే. ఇంకెందుకూ పనికిరావు" సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు మా ధనుంజయ రావు.

నేను అంగీకరించలేక పోయాను. అందుకే "నీ అభిప్రాయం తప్పు" అన్నాను ఠక్కున.

చివ్వున తలెత్తి నా ముఖంలోకి సూటిగా చూశాడు వాడు. నేను వాడి చూపుల్లో నా చూపుల్ని ముడేశాను.

"ఏవిటంత ధీమాగా మాట్లాడుతున్నావు?" కోపంగా అడిగాడు.

"శాస్త్రం మీద నాకున్న నమ్మకం అలాంటిది"

"ఇక్కడ కావలసింది నమ్మకాలు కాదు... కళ్ళెదురుగా జరుగుతున్న నిజాలు" విసురుగా అన్నాడు.

"ఏవిటా నిజాలు?" ఆశ్చర్యంగా అడిగాను.

"పరంధామయ్యగారమ్మాయికి నిన్న తొంభై తొమ్మిదో పెళ్ళి చూపులు. వాళ్ళు జాతకం అడిగార్ట. వీళ్ళిచ్చారు. వెంటనే కబురు... పిల్లజాతకంలో అవయోగం ఉంది మాకొద్దని. అసలీ జాతకాలనేవి ఉండబట్టే కదా! ఆ పిల్ల ఇంతకాలం అవివాహితగానే ఉండిపోయింది. ఆనమ్మకమే లేకపోతే ఈ పాటికి నలుగురు పిల్లల తల్లయ్యుండేది" చెప్పడం ఆపి సిగరెట్ దమ్ము లాగి గాల్లోకి ఒదిలాడు.

"వెంకట్రావుగారబ్బాయి సంగతేవిటి చెప్పు? వాడెవడో చెయ్యి చూసి నీకు గవర్నమెంటు ఉద్యోగం రాదు పొమ్మన్నాట్ట. అదిలగాయతూ వాడు ఏ ప్రయత్నమూ చెయ్యకుండా పక్కా నిరాశా వాదిలా-తయార య్యాడు. అసలు "జాతకం హస్త సాముద్రికం అనేవి ఉండబట్టే కదా వీళ్ళ బతుకులిలా తగలడ్డాయి. మనకి తెలిసినంతలో వీళ్ళిద్దరూ తగిలారు. మనకి తెలియకుండా ఈ జాతకాలూ సెంటిమెంట్లతో ఇంకా ఎందరు బాధపడుతున్నారో! ఇప్పుడు చెప్పు... నువ్వు నమ్మే ఆ శాస్త్రాలు ఎంత మందికి మేలు చేస్తున్నయో!" నిలదీశాడు.

వాడి వాదనకి నాకు నవ్వొచ్చింది. ఉబికి వస్తున్న నవ్వుని అణచి పెట్టడం, ఆపుకోవడం ఎవరి తరం? అందుకే ఉండబట్టలేక నవ్వేశాను.

"ఎందుకలా నవ్వుతావు?" కోపంగా అడిగాడు వాడు.

"నీ అమాయకత్వానికి" నవ్వుతూనే అన్నాను.

ఆమాటలకి మావాడి మొహం అప్పుడే చెక్కిన కందగడ్డలా అయిపోయింది.

"శాస్త్రం ఎప్పుడూ అబద్ధం కాదు. అయితే అది నిజం కావడం కాకపోవడం అనేది అది చెప్పే శాస్త్ర పండితుల పాండిత్యం మీద ఆధారపడి ఉంటుంది. ఈ మాటలు నేనన్నవి కాదు. వీరేశలింగం పంతులు గారన్నవి. నిజం కూడా అంతే! ఈ ప్రపంచంలో డాక్టర్లు కోకొల్లలు. అందరూ వైద్యం చేస్తారు. కానీ కొందరిచ్చే మందులకి మాత్రమే వ్యాధులు తొందరగా నయమవుతాయి. అంతమాత్రాన మిగిలిన వాళ్ళకి వైద్యం రాదని కాదుకానీ వారు అవలంబించే వైద్యవిధానంలో మెలకువలు అంతగా తెలీదని అర్ధం. అలాగే జాతకాలూ, సాముద్రికాలూను. ఒక గ్రహం, లేదా ఒకరేఖ యొక్క ఫలితాలూ, యోగావయోగాలూ చెప్పేముందు మిగిలిన గ్రహాల్నీ లేదా రేఖల్నీ బాగా పరిశీలించి అప్పుడు చెప్పాలి. లేకపోతే జాతకం తప్పవుతుంది. అప్పుడు... ఇదుగో ఇలా నీలాంటి వాళ్ళు తయారవుతారు" ఓపిగ్గా వివరించాను.

నాకు తెలుసు. ఇంతవివరించినా అంతావిని ఆఖరికి మా వాడు తల అడ్డుగా తిప్పుతాడని. ప్రస్తుతం అదే జరిగింది. "నే నొప్పుకోను" ఆఖరి మాటగా తేల్చేశాడు.

మామూలుగా అయితే ప్రతిసారీ నేను వాడన్న మాటలకి నవ్వేసి- "నువ్వీ శాస్త్రాన్ని నమ్మే రోజొకటి ఒస్తుంది. అప్పుడేమంటావో చూస్తాను" అనేవాణ్ణి.

కానీ... ఎందుకో ఈసారలా అనలేక పోయాను సరికదా మాటే కాదు కనీసం చిరునవ్వు కూడా నవ్వ లేకపోయాను. ఎందుకో తెలీదు గానీ ఈ సారి వాడి మాటలకి నాలో అదోరకం పట్టుదల పుట్టింది. 'మా వాడు శాస్త్రాన్ని నమ్మే రోజు దానంతట అదిరాదు.... నేనే రప్పించాలి' అన్న ఆలోచన ఆ క్షణంలో నాలో కలిగింది.

"ఏవిటాలోచిస్తున్నావు?" అడిగాడు వాడు.

"నిన్నెలా నమ్మించాలా అని" దాచకుండా చెప్పేశాను.

అది విని పెద్ద పెట్టున నవ్వాడు వాడు.

"నీతరం కాదు" నవ్వుతూనే అన్నాడు.

"అవుతుంది" సవాల్ చేశాన్నేను.

మావాడేదో అనబోయాడు. ఇంతలో వెంకట్రావు గారబ్బాయి వచ్చాడక్కడికి. ఒచ్చి రెండు నిమిషాలు.... మమ్మల్నిద్దర్నీ రెప్పవాల్చకుండా చూశాడు.

"ఏవిట్రా అబ్బాయ్ అలాచూస్తున్నావు? ఈ తాతగార్లు ఈ రోజు నీకు కొత్తగా కనిపిస్తున్నారా ఏవిటి?" జోక్ చేశాన్నేను.

నా మాటలకి వాడు నవ్వలేదు సరికదా గాఢంగా నిట్టూర్చాడు. "ఏదేమైనా మీరు అదృష్ట వంతులు తాతగారూ! చక్కగా ఇరవైల్లోకి రాగానే ఉద్యోగం సంపాదించుకున్నారు. అరవైల్లోకి రాగానే రిటైరయిపోయి సొంత ఇంట్లో కూచుని కృష్ణా! రామా అనుకుంటున్నారు. మేమూ ఉన్నాం ఎందుకూ!" నిరాశగా అన్నాడు. అనేసి మరోసారి నిట్టూర్చి అక్కణ్ణుంచీ వెళ్ళిపోయాడు.

"చూశావుగా! అదీ వాడి తంతు. నిన్న మొన్నటిదాకా చురుగ్గా తిరిగిన కుర్రాడు. నీ శాస్త్రమే వాణ్ణిలా నిర్వీర్యుణ్ణి చేసింది.... బతికున్న వాళ్ళని, భవిష్యత్ చెప్పే నెపంతో జీవచ్ఛవాల్లా మార్చేసే ఈ శాస్త్రాల్ని ఉంచేకంటే తగలేయడం ఉత్తమం" ఆవేశంగా అన్నాడు వాడు.

మా ధనుంజయరావు అన్నమాటలకి నా మనసు కలుక్కుమంది. "లేదు... అలా జరగడానికి వీల్లేదు. నువ్వు ఏ శాస్త్రాల్నయితే దూషిస్తున్నావో, ఏ శాస్త్రం వల్లనయితే ఓ మనిషి నిరాశావాదిగా తయారయి కష్ట నష్టాల్ని అనుభవిస్తున్నాడని భావిస్తున్నావో అదే శాస్త్రంతో తిరిగి ఆ మనిషిని ఆశావాదిగా మార్చ వచ్చు" ఆవేశంగా అన్నాన్నేను. నా ఆవేశానికి మా వాడు ఆశ్చర్య పోయాడు. ఆతర్వాత నవ్వాడు. "ఏవిటీ? ఛాలెంజా?" రెచ్చగొడు తున్నట్టుగా అన్నాడు.

"అవును... ఛాలెంజే"

"సరే! నీ సవాల్ బావుంది. గెలిస్తే ఏగొడవా లేదు. మరి ఓడిపోతే?"

"ఓడను... ఒకవేళ అదే జరిగితే నేనూ ఈ శాస్త్రాల్ని నమ్మడం మానేస్తాను" స్థిరంగా అన్నాను.

"మాటమీదుండాలి" మావాడు హెచ్చరించాడు.

"అలాగే! కానీ నువ్వు నా ప్రయత్నానికి అడ్డురాకూడదు మరి" నేనూ హెచ్చరించాను.

"ఓ మనిషిని నువ్వు బాగు చేస్తానంటే నేనెందుకడ్డొస్తాను? అలాగే కానీ" రాజీకొచ్చాడు.

ఆ క్షణం నుంచీ... ఆవిధంగా మా ఇద్దరి మధ్యా పందెం మొదలయింది.

❖ ❖ ❖

**పం**దెం ప్రకారం. ఆ మర్నాడు సాయంత్రం వీధరుగు మీద పడక్కుర్చీలో సెటిలయిన నేను వెంకట్రావుగారబ్బాయిని పనిగట్టుకుని మరీ పిల్చాను. నేను పిలవడమే ఆలస్యం వాడొచ్చి నా ముందు వాలిపోయాడు.

"ఏవిటి తాతగారూ పిల్చారు?" ఒచ్చి కూర్చుంటూ అడిగాడు.

"ఏం లేదు రా అబ్బాయ్! ఏవీ తోచట్లేదు. కాసిని కబుర్లు చెబుతావని" అన్నాను.

వాడేం మాట్లాడలేదు.

"ఆఁ... ఏవిట్రాఅబ్బాయ్ విశేషాలు" నేనే అడిగాను.

"మా లాంటి నిరుద్యోగుల దగ్గర విశేషాలేముంటాయి తాతగారూ!" నిరాశగా అన్నాడు.

"ఇప్పుడంటే నిరుద్యోగివి కానీ భవిష్యత్‌లో ఉద్యోగస్తుడివి కావా ఏవిటి?" మందలింపుగా అన్నాను.

"కాను తాతగారూ! కాలేను" అప్పటికే వాడి ముఖంలో బాధ సుడులు తిరుగుతోంది.

నా మనసు విల విల్లాడింది.

"అలా అని ఎందుకనుకుంటున్నావ్" ఏమీ తెలియనట్టే అడిగాను.

"అనుకోవడం కాదు. ఖచ్చితంగా నిజం అదే. నాకసలు గవర్నమెంట్ ఉద్యోగం వచ్చే యోగం లేదట." బాధగా అన్నాడు.

"ఎవడా చెప్పింది?" విసురుగా అడిగాను.

"మల్లావధాన్లు గారు" ఠక్కున చెప్పాడు.

నేను కిక్కురు మన్లేదు. ఎందుకంటే హస్త సాముద్రికంలో మల్లావధాన్లు గారు ఘనాపాఠీ అన్న విషయం అప్పుడే పుట్టిన పసికందుక్కూడా తెలుసు. అందుకే నేను కాస్సేపు ఆలోచనలో పడ్డాను. నిజానికి



మల్లావధాన్లంతటి వ్యక్తి అవునని చెప్పాడంటే ఇక దాన్ని కాదనడానికి వీలుండదు. కానీ ఆ మాటల్తో, ఎంతో సాధించాల్సిన ఓ యువకుడు ఎందుకూ పనికి రాకుండా అయిపోయాడు. శాస్త్రాన్ని త్రోసి రాజనలేను. అలా అని చూస్తూ చూస్తూ ఓ యువకుణ్ణి జీవచ్ఛవంలా ఒదిలెయ్యనూ లేను. ఎటూ పాలు పోలేదు నాకు.

అయినా ఒక్కసారి వాడి చెయ్యి చూస్తే? అనిపించింది. అవును... చూస్తే తప్పేంలేదు. ఒకడి అరచేతిని ఎంత మందయినా చూడచ్చు. చూసి ఫలితాలు చెప్పనూ వచ్చు. ఒకరు అనుభవంతో చెప్పింది కాదన కూడదు కానీ, ఇంకొకరు పొరబాటు చెబితే దాన్ని ఖండించవచ్చు. అంచేతనే...

"ఒరేయ్ అబ్బాయ్! రేపొద్దున్నే ఓ సారి నాదగ్గరకి రా! నీ చెయ్యి చూస్తాను" అన్నాను.

వాడు సరేనన్నట్టు తలూపాడు. మరి కొంచేసేపు ఆ కబురూ ఈ కబురూచెప్పి ఇంటికి వెళ్ళడం కోసం లేచాడు. వాడు వెళ్ళేముందు "పొద్దున్నే రావడం మర్చిపోకు సుమీ" అంటూ మరోసారి హెచ్చరించాను.

తెల్లారింది. ఠంచనుగా ఆరయ్యేసరికల్లా నాముందున్నాడు వెంకట్రావు గారబ్బాయి.

"ఏరా అబ్బీ! నేను చెప్తే నీకు నమ్మకం కుదురుతుందా?" భూతద్దాన్ని పై కండువాతో తుడుచుకుంటూ అడిగాను.

"అయ్యయ్యో! ఎంతమాట? అసలు మీలాంటివారు చెయ్యిచూస్తాననడమే మహాయోగం. ఇక నమ్మకం లేకపోవడమా!" వినయంగా భక్తిగా అన్నాడు.

చాలు! నా మీద వాడికి ఆమాత్రం నమ్మకం ఉంటేచాలు. ఇద్దరం కలిసి ఉదయపుటెండ సూటిగా పడేచోట కూర్చున్నాం. వాడి కుడి చేతిని అందుకుని పరిశీలించడం ప్రారంభించాను. ఆ చేతిరేఖల్ని చూస్తున్న నాలో చెప్పలేనంత ఆశ్చర్యం. ఆయుష్రేఖ, హృదయ రేఖ... ఒకదాని తర్వాత ఒకటిగా రేఖల్ని పరిశీలిస్తుంటే... నానోట్లోంచి అప్రయత్నంగానే "ఓరి నీఇల్లు బంగారంగానూ!" అన్నపొగడ్త ఒచ్చేసింది. గ్రహవేదికల్ని పరిశీలిస్తుంటే... "నీ అసాధ్యం కూలా! నక్కని తొక్కావురా నాయనా!" అనకుండా ఉండలేక పోయాను. అంతా - పరిశీలించడం పూర్తయ్యాకా అప్పుడు తలెత్తి తృప్తిగా నిట్టూర్చాను.- నాభావాలేవిటో అర్థం కాక వాడు నా ముఖంలోకి అయోమయంగా చూస్తున్నాడు.

"ఏరా అబ్బాయ్! వజ్రాయుధం లాంటి ధ్వజరేఖని చేతిలో ఉంచుకుని అలా ఏదీ చేతగాని వాడిలా కూర్చున్నావేం? ఇది నీకు సబబే?" నిలదీశాన్నేను.

నా మాటలు అర్థంకాలేదు కాబోలు వాడు పూర్తిగా అయోమయంలో పడ్డాడు.

"అదికాదురా భడవా! నీకు గవర్నమెంటు ఉద్యోగం రాదు. కరెక్టే! కానీ నీ చేతిలో బుధ వేదిక చాలా బావుంది. పైగా అందులో నిలువురేఖ కూడా ఉంది. అంటే నీకు ఉద్యోగం రాదు కానీ వ్యాపారంలో బహు బ్రహ్మాండంగా రాణిస్తావు. అదీకాక ఒకటికి రెండుతోడయినట్టు తలపెట్టిన ప్రతిపనిలో విజయం చేకూర్చి పెట్టే ధ్వజరేఖ నీ చేతిలో జెర్రి గొడ్డులా ఉంది. ఇకనేం... నువ్వు చాలా అదృష్టవంతుడివొరేయ్!" వాణ్ణి ఆకాశానికి కెత్తేశాన్నేను.

కానీ వాడు నావైపు అపనమ్మకంగా చూశాడు. అంతే కాదు... "మరి... ఇవన్నీ మల్లావధాన్లుగారెందుకు చెప్పలేదు నాకు?" అనుమానంగా అడిగాడు. వాడి ప్రశ్నకి నేను గతుక్కుమన్నా అంతలోనే సర్దుకున్నాను.

"అదా... అసలాయనకి చెయ్యందిస్తూ ఏమని అడిగావు?" ప్రశ్నించాను.

"నాకు గవర్నమెంటు ఉద్యోగం ఒస్తుందా? అని"

"ఏవన్నాడు?"

"చెయ్యి చూసి రాదన్నాడు"

"తర్వాత?"

"పెళ్ళెప్పుడవుతుందని అడిగాను. ఇరవయ్యేడో ఏట అవుతందని చెప్పాడు. ఆ తర్వాత నేనింకేమీ అడగలేదు"

"అదీ సంగతి. ఆయన ఉద్యోగం రాదనగానే వెంటనే పెళ్ళి సంగతి అడిగేశావు తప్ప పోనీ వ్యాపారంలో రాణిస్తానా? వ్యాపారవేత్తనవుతానా! అనడగ లేదు నువ్వు. అడిగుంటే ఆయనా ఈ ముక్కలే చెప్పుండేవాడు. పోనీ.. కావాలంటే మళ్ళీ వెళ్లి ఆయన్నే అడుగు. నా మాట అబద్ధవేమో!" గట్టిగా అన్నాను.

"అయ్యో! మీ మాట మీద నమ్మకం లేకపోవడమే. ఎంతమాట?" నొచ్చుకుంటున్నట్టుగా అన్నాడు.

"అయితే ఇకనేం? ఏదో ఓ వ్యాపారం మొదలెట్టు మరి!" ప్రోత్సహిస్తున్నట్లుగా అన్నాను. "వ్యాపార మంటే మాటలా? పెట్టుబడి కావద్దూ! ముందు దానికోసం ప్రయత్నించాలిగా... సర్లెండి! మా పెద్దాళ్ళతో కూడా ఆలోచించాలిగా. వస్తాను" అని వెళ్లిపోయాడు.

"అస్త్రం సంధించాను. లక్ష్యం చేరుకోవాలిక" అనుకుంటూ గాఢంగా నిట్టూర్చాను.

కాల గర్భంలో వారం కలిసిపోయింది.

ఆ రోజు పొద్దున్నే నా దగ్గరకొచ్చాడు వెంకట్రావు గారబ్బాయి.

ఒస్తూనే నా కాళ్ళకి దణ్ణం పెట్టాడు.

"ఓరి ఓరి ... ఏవిట్రా ఇది?" ఆప్యాయంగా అడిగాను.

"వ్యాపారం మొదలెట్టడానికి పెట్టుబడికోసం వెదుతున్నాను. అప్పు దొరకాలని ఆశీర్వదించండి." అన్నాడు.

"నాదేం ఉందోయ్! అంతాధ్వజ రేఖే చూసుకుంటుంది. వెళ్ళు" అన్నాను. ఆ మాటతో వాడి మొహం ట్యూబ్‌లైట్‌లా వెలిగిపోయింది. నా దగ్గర శలవు తీసుకుని హుషారుగా అక్కణ్ణుంచీ వెళ్ళిపోయాడు.

అలా వెళ్ళిన వాడు రాత్రి పదింటిగ్గానీ ఇల్లు చేరుకోలేదు. అంత అర్ధ రాత్రిలోనూ వెంటనే నా దగ్గరకొచ్చేశాడు. ఒచ్చి... "అప్పు దొరికింది తాతగారూ! కానీ నేననుకున్న వాళ్ళ దగ్గరకాదు. వేరేచోట. నిజానికి వెళ్ళగానే పనికాలేదు. ఇంచుమించు పదిమందిని కలిశాను. మొదటి తొమ్మిది మంది కాదన్నారు. ధ్వజరేఖ ధర్మమాని చివరికి పదోవాడి దగ్గర దొరికిందిలెండి..." హుషారుగా చెప్పుకుపోతున్నాడు. వింటున్న నేను అతని మాటల్లో ధ్వజరేఖ మెరవడం చూసి హాయిగా నిట్టూర్చాను. ఆధ్వజరేఖే కనుక లేకపోతే బహుశా వీడు ఇద్దరు ముగ్గుర్ని కలిసి ఇంటికి తిరిగొచ్చేసేవాడేమో! అనిపించింది.

రోజులు గడిచిపోతున్నాయి. వెంకట్రవుగారబ్బాయి,తెచ్చిన పెట్టుబడితో కొబ్బరికాయల వ్యాపారం ప్రారంభించాడు. ధ్వజరేఖని దృష్టిలో పెట్టుకుని రాత్రింబవళ్ళూ కష్టపడ్డాడు. మొదట్లో కొన్ని ఒడుదుడుకులు ఎదురయ్యాయి. అయినా వాడు జంకలేదు. చేతిలో ధ్వజరేఖ ఉంది కనుక తనకేమీ కాదనుకున్నాడు. ఆ నమ్మకంతోనే మిన్ను విరిగి మీద పడుతున్నా చలించలేదు.

సంవత్సరం తిరిగే సరికల్లా ధ్వజరేఖ ధర్మమాని వెంకట్రావుగారబ్బాయి వ్యాపారస్తుడయ్యాడు. నిన్న మొన్నటి వరకూ నిరాశావాదిగా తిరిగిన అతను ఆశావాదిగా మారిపోయాడు. ఆత్మ విశ్వాసంతో మున్ముందుకు దూసుకుపోతున్నాడు. వాడిలో ఒచ్చిన- మార్పుకి మా ధనుంజయరావు నిజంగానే ఆశ్చర్యపోయాడు. ఆనందించాడు.

"ఏం చెప్పావేవిట్రా? వాడలా మారిపోయాడు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"వాడికి చేతిలో ధ్వజరేఖ ఉందని చెప్పాను" వివరించాను.

"నిజమా!" అపనమ్మకంగా అడిగాడు.

"అవునో కాదో వాణ్ణే అడుగు" తాపీగా అన్నాను.

"ఎందుకులే! నీ మీద నాకు నమ్మకం ఉంది. అంటే... వాడి చేతిలో ఉన్న ధ్వజరేఖే వాణ్ణీస్థాయికి తెచ్చిందంటావు?" అడిగాడు.

"ధ్వజరేఖ కాదు... అది వాడి చేతిలో ఉందన్న నమ్మకం ఉంది చూశావూ! అదీ వాణ్ణి పైకి లాక్కొచ్చింది" చెప్పాను.

"అంటే... నిజంగా వాడి చేతిలో ధ్వజరేఖ లేదా?" అనుమానంగా అడిగాడు.

ఆ మాటకి చిన్నగా నవ్వాన్నేను. నవ్వి అన్నాను...

"ఒక మనిషి తన లక్ష్యంలో విజయం సాధించడానికి ఉండాల్సింది అరచేతిలో ధ్వజరేఖో మరోటో కాదు... పిడికెడు గుండెల్లో మొక్కవోని ధైర్యం, పట్టుదల. అవి వాడిలో ఉన్నాయి. అందుకే విజయం సాధించాడు. నిజానికి ఫలానా రేఖ ఉంది కనుక మనం- ప్రయత్నం చెయ్యాలి. విజయం సాధించాలి అన్న పట్టుదల వాడిలో పుట్టింది కనుక ఈనాడీస్థాయిలో ఉన్నాడు. అలాకాక... నా చేతిలో ధ్వజరేఖ ఉంది కదా! చూద్దాం ఇదెలాంటి ఫలితాల్నిస్తుందో అనుకుంటూ, వాడా రేఖని చూసుకుంటూ తన ప్రయత్నం మాని ఇంట్లో కూర్చుంటే మనం చెయ్యగలిగిందేమీ లేదు.

"ఏమనిషికైనా జాతకంలో ఉన్నది జీవితంలో జరగాలంటే అదృష్టానికి తోడు మానవ ప్రయత్నం కూడా ఉండాలి. అలాజరిగిన రోజే ఏమనిషయినా వృద్ధిలోకి వస్తాడు. ఇప్పుడు వెంకట్రావుగారబ్బాయి విషయంలో జరిగిందీ అదే" చెప్పి చిన్నగా నవ్వాను.

" వెంకట్రావుగారబ్బాయి సంగతి సరే! మరి పరంధామయ్యగారి అమ్మాయి మాటేవిటి?" అడిగాడు.

"వెయ్యి అబద్ధాలాడి అయినా ఓ పెళ్ళి చెయ్యమన్నారు. ఓ మనిషి గుణగణాల గురించి అబద్ధాలు చెబితే ప్రమాదం కానీ జాతకం విషయంలో అబద్ధాలాడినా పెద్దగా నష్టం ఏదీ ఉండదు... అంచేత ఆ పిల్ల పుట్టిన టైముని మార్చెయ్యడమే!"

"సారీరా! శాస్త్రాన్ని నేను అపార్థం చేసుకున్నాను." నొచ్చుకుంటున్నట్టుగా అన్నాడు వాడు.

" అర్థం చేసుకోవడం, అపార్థం చేసుకోవడం అటుంచు. ఈ శాస్త్రాలూ సాముద్రికాలూ మనిషి మనుగడకీ అభివృద్ధికీ తోడ్పడ తాయని నమ్మితే నాకంతే చాలు!" అనేసి మళ్ళీ నవ్వేశాను. నా నవ్వులో మా వాడు కూడా శృతి కలిపాడు. ❒